సాక్షి
అనకాపల్లి
సోమవారం । 11 । నవంబర్ । 2024



ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత

ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధి అన్నారు. 8లో



104 ఉద్యోగులపై ఇంత నిర్లక్ష్యమా!

104 ఉద్యోగుల పట్ల టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారు. 8లో



అంగన్‌వాడీల్లో అగ్నిమాదం

రోలుగుంటలోని 2,4,5 నంబర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సరకులు దగ్ధమయ్యాయి. 8లో

బెల్టు జోరు

- వేలం పాట ద్వారా రూ.4 లక్షల వరకు చెల్లించి షాపుల ఏర్పాటు
- 30 శాతం సిండికేట్లకు, 20 శాతం ఎక్సైజ్ అధికారులకు కమీషన్లు ?
- మిగతా 50 శాతం కూటమి నేతల వద్ద ఉంచుతున్న వైనం
- బాటిల్‌పై రూ.30 అదనంగా వసూలు
- జిల్లాలో సుమారు 200 వరకు బెల్ట్ షాపుల ఏర్పాటు



బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే బెల్ట్ తీస్తానని ఇటీవల పరవాడ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన హెచ్చరికలు ఆచరణలో కనిపించడం లేదు.. దీంతో జిల్లాలో పుట్టగొడుగుల్లా దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. దీనిలో కొందరు కూటమి నేతలు, ఎక్సైజ్ అధికారులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని సమాచారం.. బెల్ట్ షాపుల ఏర్పాటుకు అనధికారికంగా అనుమతులిస్తూ కమీషన్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇప్పుడు పాన్‌షాప్‌లు, కిరాణా దుకాణాలు, ఇళ్లలో ఇలా ఎక్కడ పడితే అక్కడ.. గల్లీగల్లీలో ఎప్పుడు పడితే అప్పుడు లిక్కర్ అందుబాటులో ఉంటోంది. బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. ఇష్టానుసారంగా రేట్లు పెంచడంతో మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీతో జిల్లాలో మద్యం ఏరులైపారుతోంది. బెల్టు షాపులు మళ్లీ బార్లా తెరుచుకున్నాయి. ప్రతి మద్యం దుకాణం పరిధిలో బెల్టు షాపులు వెలుస్తున్నాయి. మరోవైపు లిక్కర్ ధరలు మందు బాబులకు షాక్ కొడుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందజేస్తామని చెప్పి.. మందుబాబుల ఓట్లు కొల్లగొట్టిన కూటమి నేతలు.. ఇప్పుడు వారి జేబులకు చిల్లులు పెడుతున్నారు. లాటరీ ద్వారా మద్యం షాపులు దక్కించుకున్న సిండికేట్లు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా గుట్టుచప్పుడు కాకుండా బెల్టుషాపులు ఏర్పాటు చేయిస్తున్నారని సమాచారం. కమీషన్లు తీసుకుంటూ బెల్టుషాపులకు అనుమతిస్తున్నారు. గ్రామాల్లో వేలం పాట ద్వారా రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకూ చెల్లిస్తూ దుకాణాలు తెరుస్తున్నారు. ఇందులో మద్యం దుకాణదారులకు 30 శాతం, ఎక్సైజ్ శాఖ అధికారులకు 20 శాతం కమీషన్ ఇస్తున్నట్లు తెలిసింది. మిగతా 50 శాతం నగదు గ్రామంలో కూటమి నేతల దగ్గరే ఉంచుతున్నారు. జిల్లాలో పాయకరావుపేట, చోడవరం, యలమంచిలి, సబ్బవరం వంటి ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు వెలుస్తున్నాయి. వీటిలో కొన్నింటిలో వేలం పాట ద్వారా డబ్బులు చెల్లించి అమ్మకాలు చేస్తుంటే,మరికొన్నింటిలో మద్యం సిండికేట్లే తమ అనుచరులు, బంధువుల ద్వారా విక్రయాలు జరుపుతున్నారు. ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకూ అదనంగా ధర పెంచి అమ్ముతున్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదిస్తే తమకు ఏమీతెలియదన్నట్టు చెబుతున్నారు.



అనకాపల్లి మండలం తగరంపూడిలో బెల్టు షాపు నుంచి స్వాధీనం చేసుకున్న మద్య సీసాలు (ఫైల్)

ఏరులై పారుతున్న లిక్కర్

2014 నుంచి 2019 మధ్య జిల్లాలో మద్యం విక్రయాలు ఇష్టానుసారంగా జరిగేవి. ఒక్కో వైన్‌షాప్ పరిధిలో 4 నుంచి 8 వరకు బెల్టుషాపులు నిర్వహించేవారు. ఒక్కొక్కరూ ఎన్ని మద్యం బాటిళ్లయినా కొనుగోలు చేసే అవకాశం ఉండడంతో పూటుగా తాగి రహదారులపై మందుబాబుల వీరంగాలు సృష్టించేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించింది. బెల్టు షాపులను పూర్తిగా నియంత్రించింది. మద్యం కొనుగోలు విషయంలో కూడా 3 బాటిళ్లకు పరిమితి విధించింది. గత ఐదేళ్ల బెల్టు షాపుల జాడే కనిపించకుండా పోయింది. కానీ తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మళ్లీ బెల్టుషాపులు తెరుచుకున్నాయి. ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటైన తొలి రోజు నుంచే బెల్టుషాపుల ఏర్పాటు ప్రారంభమైంది. వైన్‌షాప్ నిర్వాహకులే నేరుగా అనువైన అన్నిచోట్ల వారి అనుచరులు,బంధువులతో ఇళ్ల,పాన్‌షాపు లు, టిఫిన్ సెంటర్లలో మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో గుడి,బడి అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోను మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొంత మంది తెలిసిన వారికి ముందస్తు చెల్లింపులు లేకుండానే మద్యం బాటిళ్లు సరఫరా చేసి.. విక్రయాలు జరిగిన తరువాత వారు డబ్బులు ఇచ్చే వెసులుబాటు కల్పిస్తున్నారు.

జిల్లాలో వివరాలు ఇలా..

- జిల్లాలో 136 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో గతంలో కంటే అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారని, బెల్టు షాపుల్లో ఒక్కో బాటిల్ పై రూ.20 నుంచి రూ.30 వరకూ రేటు పెంచి అమ్ముతున్నారని తెలిసింది.
- చోడవరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 40 బెల్టు షాపులు తెరిచాయి. వీటిలో వేలం పాట ద్వారా ఏర్పాటుచేసినవి 10 నుంచి 15 ఉంటే..మిగిలినవి మద్యం దుకాణదారులను ఎక్సైజ్ అధికారులు తమకు తెలిసిన వారితో, అనుచరులతో ఏర్పాటుచేశారని సమాచారం.
- నర్సీపట్నం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 30 వరకూ బెల్టు షాపులు వెలిశాయి. వీటిలో వేలం పాట ద్వారా డబ్బులు చెల్లించి 10 వరకూ నిర్వహిస్తున్నారని భోగట్టా.
- పాయకరావుపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 30నుంచి35 వరకూ బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. వీటిలో వేలం పాట ద్వారా పొంది నిర్వహిస్తున్న షాపులు 10 వరకూ ఉంటాయని సమాచారం.
- యలమంచిలి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 వరకూ బెల్టు షాపులు వెలిశాయని తెలిసింది.
- అనకాపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 గ్రామాల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు.

బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే కఠినచర్యలు



బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవు. జిల్లాలో బెల్టుషాపులు ఏర్పాటు చేసినట్టు ఇప్పటివరకూ మా దృష్టికి రాలేదు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మద్యం విక్రయించాలి. అధిక ధరలకు అమ్మితే వారిపై చర్యలు తీసుకుంటాం

– సుధీర్, జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి

న్యూస్‌రీల్

కృత్తిక అఖండ జ్యోతికి ముమ్మరంగా ఏర్పాట్లు



త్రిశూల పర్వతంపైకి సామగ్రిని చేర్చిన కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని బలిఘట్టం త్రిశూల పర్వతంపై ఈనెల 15న కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తొలిసారిగా కృత్తిక అఖండ జ్యోతిని వెలిగించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. జ్యోతిని వెలిగించేందుకు అవసరమైన సామగ్రిని ఆదివారం అయ్యప్ప స్వాములు, కమిటీ సభ్యులు త్రిశూల పర్వతంపైకి తరలించారు. అరుణాచలంలో మాదిరిగా త్రిశూల పర్వతంపై అఖండ జ్యోతిని ఏర్పాటు చేయనున్నారు. వారం రోజులుగా అఖండ జ్యోతి ఏర్పాట్లలో కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు. ఈ మహత్కార్యంలో భక్తులందరూ భాగస్వాములు కావాలని ఉత్సవ కమిటీ కోరింది.

ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకంలో చోడవరం చిత్రకారుడికి స్థానం



'ఆర్ట్ ఆఫ్ ఏపీ' పుస్తక ఆవిష్కరణ సభలో సూర్యనారాయణను సత్కరిస్తున్న ప్రముఖులు

చోడవరం: 'ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకంలో చోడవరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు బొడ్డేడ సూర్యనారాయణకు స్థానం లభించింది. రాష్ట్రానికి చెందిన ప్రముఖ, అంతర్జాతీయ, జాతీయస్థాయిలో అవార్డులు పొందిన అతి తక్కువ మంది చిత్రకారుల జీవిత చరిత్రలతో కూడిన 'ఆర్ట్ ఆఫ్ ఏపీ' పుస్తకాన్ని ప్రముఖ చిత్రకారుడు కళాసాగర్ రూపొందించారు. ఈ పుస్తకాన్ని విజయవాడలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో చోడవరం చిత్రకళా నిలయం నిర్వాహకుడు, ప్రముఖ చిత్రకారుడు బొడ్డేడ సూర్యనారాయణకు స్థానం లభించింది. పుసక్త ఆవిష్కరణ సభలో ఆయనను సత్కరించారు. సూర్యనారాయణమాస్టారు వేసిన అనేక చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ అవార్డులు దక్కించుకున్నాయి. చోడవరంలో 25 ఏళ్లుగా చిత్రకళానిలయం పేరున ఆర్ట్ స్కూల్‌ను నిర్వహిస్తూ పలువురు చిత్రకారులను తయారు చేశారు. సూర్యనారాయణకు ఆర్ట్‌ఆఫ్ ఏపీ పుస్తకంలో స్థానం దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

నేడు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

దాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ సంయుక్త ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

జూలో మౌస్‌డీర్ పిల్ల జననం

ఆరిలోవ(విశాఖ): ఇందిరా గాంధీ జూ పార్క్‌లో మౌస్‌డీర్ ఒక పిల్లకు జన్మనిచ్చింది. మౌస్‌డీర్ అరుదైన వన్యప్రాణి. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం ఇది షెడ్యూల్ జాబితాలో ఉన్న జంతువు. జూలో రెండు ఆడ, ఒక మగ మౌస్‌డీర్లు ఉన్నాయి. వాటిలో ఓ మౌస్‌డీర్‌కు ఆదివారం ఉదయం ఒక పిల్ల పుట్టినట్లు జూ అధికారులు తెలిపారు. ఆ పిల్ల మగదా, ఆడదా అనేది కొద్ది రోజులు గడిచిన తర్వాతే నిర్ధారణ చేయగలమన్నారు. పుట్టిన పిల్లతో కలిపి జూలో ప్రస్తుతం నాలుగు మౌస్‌డీర్లు ఉన్నట్లు వివరించారు.

సింహాద్రి ప్రాజెక్టు హెడ్‌గా సమీర్ శర్మ

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్‌గా సమీర్ శర్మను నియమిస్తూ ఎన్టీపీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఇంతవరకు మధ్యప్రదేశ్‌లో వింధ్యాచల్‌లోని ఎన్టీపీసీ ఓఅండ్ఎం జీఎంగా పనిచేశారు. ఇక్కడ జీజీఎంగా విధులు నిర్వహించిన సంజయ్ కుమార్ సిన్హాను తమిళనాడులోని వల్లూర్‌లోని ఎన్‌టీఈసీఎల్‌కు సీఈవోగా బదిలీ చేశారు.

కేజీహెచ్ ఏడీగా అప్పారావు

మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్(పరిపాలన)గా పి.ఎస్.అప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం విజయనగరం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏడీగా పని చేస్తున్న ఆయన సోమవారం ఇక్కడ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ, కేజీహెచ్‌లో పనిచేశారు.

స్టీల్ ప్లాంట్‌పై బాబు, పవన్ సమాధానం చెప్పాలి

- ఇంత జరుగుతున్నా వారు ఎక్కడున్నారు?
- సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షురాలు పుణ్యవతి ఎద్దేవా
- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ కార్మికుల ధర్నా



ఆర్ఐఎన్ఎల్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని ప్లకార్డు ప్రదర్శిస్తున్న పుణ్యవతి

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షురాలు ఎస్.పుణ్యవతి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ ఆపరిశ్రమ కార్మికులు గాజువాకలో ఆదివారం ధర్నా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులను కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, వీఆర్ఎస్ పేరుతో కార్మికుల తొలగింపు ఆపాలని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సేవ్ పబ్లిక్ సెక్టార్..సేవ్ ఇండియా అంటూ నినదించారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజా సమస్యలు పట్టడంలేదన్నారు. ఈ ధర్నాలో వాస్తవానికి చంద్రబాబు కూర్చోవాలన్నారు. ఇంత జరుగుతున్నా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నుంచి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం కార్మికులు తమ కుటుంబాలతో నాలుగేళ్లుగా ఆందోళన చేస్తున్నా ఏ మాత్రం కేంద్ర ప్రభుత్వానికి పట్టడంలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అదానీకో,మిట్టల్‌కో, మరెవరికో కట్టబెడతామంటున్నారని, ప్రైవేట్‌వాడు వచ్చి ఏం ఉద్ధరిస్తాడని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు.

సంస్థ పురోభివృద్ధికి కృషి చేద్దాం..

- ఎన్టీపీసీని సందర్శించిన సౌత్ ఆర్‌ఈడీ పాండు

పరవాడ: సంస్థ పురోభివృద్ధికి అంతా కలిసి పనిచేయాలని ఎన్టీపీసీ సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆర్.పాండు పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీని ఆదివారం సందర్శించారు. ఆయనకు జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా పుష్పగుచ్ఛం అందించి, సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సింహాద్రి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థ పురోభివృద్ధిపై ఉన్నతాధికారులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చించారు. ఎన్టీపీసీలో జరుగుతున్న కార్యకలాపాలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్శనలో భాగంగా సంస్థలో కంట్రోల్ రూమ్, సీహెచ్‌పీ డబ్ల్యూటీ ఏరియా, ఎఫ్‌జీడీ, జీవన్ రేఖా ఆస్పత్రిలోని సృజనం చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి, అక్కడి కార్యకలాపాలపై సంబంధిత అధికారులు, పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు.

అంగరంగ వైభవంగా స్వర్ణోత్సవం

దీపాంజలినగర్‌లోని సాధన క్రీడా మైదానంలో శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగిన ఎన్టీపీసీ స్వర్ణోత్సవంలో కె.ఆర్.పాండు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రాండ్ కల్చరల్ ఈవెంట్‌ను ఆసాంతం తిలకించారు. ఈవెంట్‌లో గాయకుడు శ్రీరామచంద్ర తన అద్భుత పాటల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. రైజింగ్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భారతదేశ విద్యుత్ రంగంలో ఎన్టీపీసీ 50 ఏళ్ల ప్రయాణం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

వేడి సాంబారు పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

అచ్యుతాపురం: స్థానిక ఏపీ గురుకుల పాఠశాలలో వేడి సాంబారు మీదపడి 8వతరగతి చదువుతున్న బాలికకు గాయాలైన సంఘటన ఆలస్యంగా తెలిసింది.ఇందుకు సంబంధించి ఎంఈవో దేవరాయల్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి భోజనం చేసే సమయంలో బాలికలంతా ప్లేట్లు పట్టుకుని భోజనం కోసం వేచి ఉన్నారు.కొంతమంది బాలికలు భోజనం కోసం ముందుకు దూసుకుపోయిన క్రమంలో 8వ తరగతి చదువుకుంటున్న బాలిక కాలికి సాంబారు గిన్నె తగలడంతో సాంబారు కాలి మీద పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన బాలికను గురుకుల పాఠశాల సిబ్బంది అచ్యుతాపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి మెరుగ్గానే ఉందని ఎంఈవో దేవరాయల్ తెలిపారు.

కడప, విశాఖ విజయకేతనం



బాలుర విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న విశాఖపట్నం జట్టుకు బహుమతి అందజేస్తున్న అతిథులు



బాలికల విభాగంలో మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్న కడప జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

- ముగిసిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లిలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 బాల బాలికల హాకీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 500 మందికి పైగా హాకీక్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలుర విభాగంలో నాలుగు జట్లు, బాలికల విభాగంలో నాలుగు జట్లు సెమీ ఫైనల్స్‌కు ఎంపికయ్యాయి. చివరిరోజు ఆదివారం పెదబోదిగల్లం రోడ్డులో ఉన్న హెటిరో హాకీ మైదానంలో జరిగిన ఫైనల్స్‌లో వైఎస్సార్ కడప, విశాఖపట్నం బాలికల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు 2–1 స్కోర్‌తో ప్రథమస్థానాన్ని, విశాఖపట్నం జట్టు ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకున్నాయి.కర్నూలుతో ఆడిన చిత్తూరు జట్టు 3–0 స్కోర్ తృతీయస్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో విశాఖపట్నం, వైఎస్సార్ కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 1–0 స్కోర్‌తో విశాఖపట్నం జట్టు మొదటి స్థానాన్ని, కడప జట్టు ద్వితీయ స్థానాన్ని కై వసం చేసుకున్నాయి. తూర్పుగోదావరి జట్టుతో తలపడిన చిత్తూరు జట్టు 2–1 స్కోర్‌తో తృతీయస్థానంలో నిలిచింది. విజేతలకు రాష్ట్రకాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, వైస్ ఎంపీపీ వీసం నానాజీ,స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్‌ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి మండల కేంద్రం వేదిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ క్రెడిట్ అంతా బలిరెడ్డి సత్యవతి హాకీక్లబ్‌కే దక్కుతుందన్నారు. క్లబ్ వ్యవస్థాపకులు సూరిబాబు, తాతాజీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అనేక వ్యయప్రయాసలకోర్చి ఇక్కడ క్రీడాకారులకు హాకీలో తర్ఫీదు ఇస్తున్నారని చెప్పారు. హాకీ క్రీడాకారులను బాగా తర్ఫీదు ఇస్తున్న బీఎస్ హాకీ క్లబ్‌కి తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. క్రీడాకారుల కోసం హాకీ గ్రౌండ్ సమకూర్చిన హెటిరో యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, ఎంఈవోలు కుంచం నరేష్, వి.నూకరాజు, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కోసూరు శ్రీను, బీఎస్ క్లబ్ వ్యవస్థాపకులు సూరిబాబు, తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

విజేతలుగా నిలిచిన వారిలో అత్యంత ప్రతిభకనపరచిన బాల బాలికలను డిసెంబరు 8 నుంచి 13వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని మాండిసోరిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు.

నేవీ డే.. విశాఖలో లేనట్లే!



తొలిసారి పూరీలో నిర్వహించేందుకు ఏర్పాట్లు

రాష్ట్రపతి హాజరుకానున్న నేపథ్యంలో వేదిక మార్పు

సంద్రంలో యుద్ధశబ్దాలు.. తీరంలో శత్రుమూకలపై ఆకస్మిక దాడులు.. సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించడం.. ఎగురుతున్న హెలికాప్టర్ల నుంచి కిందకు దిగడం.. ప్యారాచూట్లతో నేవీ సిబ్బంది ప్రదర్శనలు.. భూమి, ఆకాశంతో పాటు సముద్ర జలాలపై విన్యాసాలు.. ఈ ఏడాది ఇవేవీ కనిపించవు.. ఎందుకంటే ఈసారి నేవీ డేని పూరీలో నిర్వహించాలని భారత నౌకాదళం నిర్ణయించింది. ఆ రోజు కేవలం విద్యుత్ వెలుగుల్లో రెండు యుద్ధ నౌకల ప్రదర్శనకే విశాఖ తీరం పరిమితం కానుంది.

- 1971లో పాక్‌పై విజయం తర్వాత విశాఖలో నేవీడే నిర్వహణ
- 2012లో ప్రధాని గుజ్రాల్ మృతితో విన్యాసాలు రద్దు
- 2020లో కోవిడ్ కారణంగా రద్దు చేసిన నౌకాదళం
- ఈసారి ఏకంగా విశాఖకు దూరంగా నేవీ డే విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం : 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారత నౌకాదళం ప్రదర్శించిన సాంకేతిక ప్రతిభా పాటవాలు, వ్యూహాలు, ధైర్యసాహసాలకు గుర్తుగా ప్రతి ఏటా డిసెంబర్ నాలుగో తేదీని నేవీ డేగా నిర్వహిస్తున్నారు. ఆ రోజున తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో సాగర తీరంలో ఆర్‌కే బీచ్ వద్ద భారత నౌకాదళ సామర్థ్యాలను ప్రదర్శించేవారు. ఇందుకోసం నవంబర్ నుంచే నౌకాదళ సిబ్బంది తీవ్ర కసరత్తులు చేసేవారు. యుద్ధనౌకలు, హైస్పీడ్ బోట్లు, జెమినీ బోట్లు యుద్ధ విమాన విన్యాసాలు, హెలికాప్టర్లు, స్కై డైవర్లు.. శత్రు స్థావరాలపై విరుచుకుపడే మెరైన్ కమాండోలు, యుద్ధ ట్యాంకులతో ఆర్‌కే బీచ్ ఆక్రమణ... ఇలా.. ఒకటి కాదు రెండు కాదు.. కళ్లు చెదిరే విన్యాసాలతో కదన రంగాన్ని తలపించే ఆరోజు కోసం విశాఖ ప్రజలే కాదు దేశమంతా ఎదురు చూస్తుంటుంది. ఈ సారి మాత్రం భారత నేవీ శక్తి సామర్థ్యాలను ప్రత్యక్షంగా వీక్షించే అదృష్టం నగర వాసులకు లేదు. ఈసారి నేవీ డేని విశాఖలో కాకుండా పూరీలో నిర్వహించాలని భారత నౌకాదళం నిర్ణయించింది.

తొలిసారి పూరీ వేదికగా..

ఏటా నౌకాదళ దినోత్సవాలు విశాఖ వేదికగా జరుగుతాయి. ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ మంత్రితో పాటు భారత నౌకాదళాధిపతి, రాష్ట్ర మంత్రులు, నౌకాదళాధికారలు హాజరవుతుంటారు. పశ్చిమ నౌకాదళంలోనూ నేవీ డే నిర్వహించినా.. ప్రధాన వేడుకలు మాత్రం విశాఖలోనే జరుగుతాయి. తొలిసారిగా విశాఖ వేదికని రద్దు చేసి.. ఒడిశా రాష్ట్రంలోని పూరీలో వేడుకలు నిర్వహించాలని తూర్పు నౌకాదళం నిర్ణయించింది.

ఒడిశా కూడా తూర్పు నౌకాదళం పరిధిలోనే ఉంది. నేవీ డే విన్యాసాల వేదికలను మార్పు చేయాలని గతేడాది నిర్ణయించినా దాన్ని పశ్చిమ నౌకాదళంలోనే అమలు చేశారు. ఈసారి ఈఎన్‌సీలో అమలుకు నిర్ణయించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సొంత రాష్ట్రం కావడంతో ఈ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తూర్పు నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు మొత్తం.. ఈ నెల మూడో వారంలో పూరీకి పయనం కానున్నాయి.

కోవిడ్ తర్వాత.. మరో'సారీ'

1971లో పాక్‌కి చెందిన ఘాజీ జలాంతర్గామిని విశాఖ తీరానికి సమీపంలో మట్టుబెట్టారు. ఈ కారణంగానే నేవీ డేని ఇక్కడ నిర్వహిస్తున్నారు. 2012లో మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ మరణించడంతో ఆయన సంతాప దినంలో భాగంగా నేవీడే ఉత్సవాల్ని పూర్తిగా నిర్వహించలేదు. కరోనా కారణంగా 2020లో వేడుకలు రద్దయ్యాయి. ఈసారి ఏకంగా వేదికనే మార్చేయడంతో విశాఖ వాసులు నిరాశ చెందుతున్నారు. అయితే డిసెంబర్ 4న ఏటా మాదిరిగా ఉదయం 7.30 గంటలకు నౌకాదళాధికారులు బీచ్‌రోడ్‌లోని విక్టరీ ఎట్ సీ స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు. అనంతరం గౌరవ వందనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఆర్‌కే బీచ్‌కి సమీపంలో రెండు యుద్ధనౌకలతో ప్రదర్శన నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. దీనిపై త్వరలోనే నిర్ణయం వెలువడనుందని తూర్పు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.

క్లుప్తంగా

ఘనంగా గురునానక్ జయంతి

సీతమ్మధార: సిక్కుల మొదటి గురువు గురునానక్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గురుద్వారా సత్సంగ్ మందిరంలో అధ్యక్షుడు డి.ఎస్.ఆనంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నగర్ కీర్తన్ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 2 గంటలకు ఉత్తర ఎమ్మెల్యే కుమార్తె శ్యామల దీపిక జెండా ఊపి నగర్ కీర్తన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ర్యాలీ సీతంపేట, ఆర్టీసీ కాంప్లెక్స్, పాత జైలు రోడ్డు, సెవన్ హిల్స్ ఆస్పత్రి, సిరిపురం, ఆర్.కె.బీచ్, పామ్ బీచ్, కాళీమాత గుడి నుంచి రామాటాకీస్, సత్యం జంక్షన్ల మీదుగా తిరిగి రాత్రి 7 గంటలకు గురుద్వారా వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా సిక్కు జెండాలతో అలంకరించిన నిషాన్ సాహిబ్ వాహనం ర్యాలీలో పాల్గొంది. పెద్ద సంఖ్యలో సిక్కులు హాజరై సందడి చేశారు.

జాబ్‌మేళా రేపు

మహారాణిపేట: నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న మహారాణిపేట నాక్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ మేళాలో వీల్స్‌మార్ట్, 2 నిధి ఫైనాన్షియల్ సర్వీసెస్, పే-టీమ్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, ఎంపికైన వారు విశాఖపట్నం, గాజువాక ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9676170026 సంప్రదించాలన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రణాళికలు



రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీ సీఎం రమేష్

తుమ్మపాల : రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకునేలా అభివృద్ధి ప్రణాళికలు వేస్తున్నట్లు ఎంపీ సి.ఎం రమేష్ అన్నారు. పట్టణంలో రైల్వే స్టేషన్, నిలిచిపోయిన లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు.

నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న డ్రైనేజీ, ప్లాట్‌ఫారం, ప్రయాణికుల విశ్రాంతి భవన సముదాయం పనులు కూడా వేగంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాట్‌ఫారం మీద ఉన్న దుకాణదారులు, పార్సిల్ కౌంటర్ కలాసీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పీలా గోవింద సత్యనారాయణ, బుద్ద నాగజగదీష్, దాడి రత్నాకర్, బొడ్డపాటి చిన్న రాజారావు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత



చోడవరంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

చోడవరం: హిందూ దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధి ఓలేటి సత్యనారాయణ అన్నారు. చోడవరం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణంలో నాలుగు మండలాల విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓలేటి సత్యనారాయణ మాట్లాడుతూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, దేవాలయాల నిర్వహణలో సంస్కరణలు తీసుకురావాలని అన్నారు. దేవదాయ శాఖలో పనిచేస్తున్న అన్యమతస్తులను తొలగించాలని, పూజా, ప్రసాద, కైంకర్య సేవలన్నీ అత్యంత భక్తి శ్రద్ధలతో నాణ్యతతో నిర్వహించాలన్నారు. రాజకీయాలతో ప్రమేయం లేకుండా ట్రస్టుబోర్డులను నియమించాలని, దేవాలయాల ఆస్తులను ఆన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలన్నారు. జనవరి 5వ తేదీన విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్కే ప్రసాద్, ప్రేమసమాజం మేనేజర్ ప్రసాద్‌రాజు, దండుపాటి సన్యాసిరావు, కందర్ప రమణమూర్తి, కొడమంచిలి చలపతిరావు, రేజేటి నరసింహచారి, సిరియాల సత్యనారాయణ, జీపీఎస్ నాయుడు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

మాడుగుల రూరల్ : హిందూ ధర్మ పరిక్షణకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి ప్రతినిధి ఓలేటి సత్యనారాయణ పేర్కొన్నారు. కె.జె.పురం కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం హైందవ శంఖారావ సన్నాహక సమావేశం జరిగింది. మండల విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలన్నారు. సుమారు 5 లక్షల హిందువులతో ఈ భారీ బహిరంగ సభ జరుగుతుందని, గతంలో అయోధ్యలో జరిగిన ఉద్యమం వలే హిందూ ధర్మపరిరక్షణ కోసం ఉద్యమానికి నడుం బిగించాలని అన్నారు. గ్రామాల్లో మతమార్పిడులను ఉపేక్షించవద్దన్నారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, రక్షణ కోసం జరుగుతున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని అన్నారు. జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 5 న జరిగే హైందావ శంఖారావానికి ప్రతి హిందువు హాజరవ్వాలన్నారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు రాపేట రామకొండలరావు మాట్లాడుతూ దేవాలయాల నిర్వహణపై ధర్మాచార్యులు తయారు చేసిన నమూనా విధి విధానాలు అమలు చేయాలని, దేవాలయ పరిసరాల్లో దుకాణాలు హిందువులకు మాత్రమే కేటాయించాలని అన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ కార్యదర్శి పి.కొండలరావు, వాలంకి శ్రీనివాసరావు, వీహెచ్‌పీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

104 ఉద్యోగులపై ఇంత నిర్లక్ష్యమా!

- సమస్యలు తీర్చకపోతే రాష్ట్రవ్యాప్త సమ్మె
- 104 ఉద్యోగుల నిరసన

అనకాపల్లి : రాష్ట్రంలో గ్రామీణ పేదలకు సేవలను అందిస్తున్న 104 వాహన ఉద్యోగుల సమస్యల పట్ల తీవ్ర టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో 104 వాహన ఉద్యోగులు (వైద్యశాఖ) ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 సంవత్సరాల నుంచి ప్రజలకు సేవలు అందిస్తున్న 104 ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 3 నెలలు జీతాలు బకాయి పెట్టిందన్నారు. 104 యూనియన్ గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం జీవో నంబర్.7 ను అమలు చేయకుండా ఎరియర్స్, ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రతి ఉద్యోగికి పీఎఫ్, ఈఎస్ఐను యాజమాన్యం వాటా యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్త సమ్మెకు సిద్ధమన్నారు. నిరసనలో 104 ఉద్యోగులు ఎం.నాగసాయి, ఆర్.అప్పల రమణ, జి. చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

చెత్తడంపింగ్ యార్డులో ఆకస్మికంగా మంటలు

- భయాందోళన చెందిన పరిసర ప్రాంత ప్రజలు



చోడవరం బాలాజీనగర్‌సమీపంలో ఉన చెత్త డంపింగ్‌యార్డులు ఎగిసిపడుతున్న మంటలు

చోడవరం : చోడవరం పట్టణ శివారున ఉన్న చెత్త డంపింగ్ యార్డులో ఒక్కసారిగా ఆదివారం రాత్రి మంటలు చెలరేగాయి. పట్టణంలో రోజూ ఊడ్చిన చెత్తను తెచ్చి ఈ ఊరు చివరన చీడికాడ రోడ్డులో వేస్తున్నారు. పంచాయతీయే ఈ చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేసింది. డంపింగ్‌లో పెద్దపెద్ద గుట్టలుగా చెత్త, ప్లాస్టింగ్ వేసి ఉంది. ఈ డంపింగ్ యార్డులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అవి పెద్దగా ఎగిసి పడుతుండడంతో యార్డుకు అతి సమీపంలో ఉన్న బాలాజీనగర్, ద్వారకానగర్ ప్రజలు భయాందోళన చెందారు. మంటలతో పాటు దట్టమైన పొగ కూడా రావడంతో సమీపంలో ఉన్న ఇళ్లలో ప్రజలు తమ ఇళ్లకు కిటికీలు, తలుపులు వేసుకొని ఉన్నారు. పంచాయతీ అధికారులకు, అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు సమాచారం ఇచ్చారు. బహిర్భూమికి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులే కాల్చిన సిగరెట్టు వల్ల ఈ మంటలు వ్యాపించి ఉండవచ్చని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. అయితే పంచాయతీ వారే చెత్తకు నిప్పుపెట్టారని బాలాజీనగర్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఇలా మంటలు ఎగిసి పడడం వల్ల భయంగా ఉందని, పెద్దగా కమ్ముకున్న కాలుష్యమైన పాగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని అంటున్నారు. నివాస ప్రదేశాలకు అతి దగ్గర్లో ఉన్న ఈ డంపింగ్ యార్డును ఊరికి దూరంగా పెట్టాలని, వ్యాపిస్తున్న మంటలు అదుపుచేయాలని బాలాజీనగర్, ద్వారకానగర్ ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అగ్నిప్రమాదం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు



కూలిన అంగన్‌వాడీ స్టోర్ రూమ్ గోడ

- ఆదివారం కావడంతో తప్పిన ముప్పు
- రూ.1.50 లక్షల నష్టం

రోలుగుంట : స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న గదుల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్టోర్ రూమ్‌లో ఉన్న ఐదు గ్యాస్ సిలిండర్లలో ఒక సిలిండర్ భారీ శబ్దంతో పేలడంతో ఆ అదురుకు స్టోర్ రూమ్ గోడ కూలిపోయింది. వివరాలిలా ఉన్నాయి. 2,4,5 నంబర్ల అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఖాళీగా ఉన్న గదుల్లో వాటిని నిర్వహిస్తున్నారు. ఈ మూడు కేంద్రాలు సుమారు 30 మంది చిన్నారులతో నడుస్తున్నాయి. ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు జగద, నూకరత్నం, దివ్య సమాచారం అందజేయడంతో డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో 87 కిలోల బియ్యం, 28 కిలోల కందిపప్పు, సుమారు 10 లీటర్ల వంట నూనె, ప్యాకెట్లతో 102 లీటర్ల పాలు, 556 గుడ్లు, 20 బెంచీలు కాలి బూడిదయ్యాయి. అయిదు సిలిండర్లకు ఒక సిలిండర్ కాలిపోయింది. ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి 'చెకుముకి' విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

పెందుర్తి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు 48 బృందాలుగా ఏర్పడ్డారు. విజువల్, మౌఖిక, క్విజ్, ప్రాక్టికల్, రాత పరీక్షల విభాగాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల నుంచి బాపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, విజయనగరం జిల్లా దినకడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, తిరుపతి జిల్లా స్పేస్ సెంటర్ పాఠశాల విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు.

ప్రైవేట్ పాఠశాలల విభాగం నుంచి కర్నూలు సెయింట్ జోసెఫ్ స్కూల్ మొదటి, అనకాపల్లి శ్రీప్రకాష్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ, గుంటూరు జిల్లా కొండవీడు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచి, బహుమతులు పొందారు. విజేతలకు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, శాస్త్రవేత్తల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

హైవే పక్కన లారీ డ్రైవర్ మృతదేహం

- మృతుడు తెలంగాణ వాసిగా గుర్తించిన పోలీసులు



లారీ డ్రైవర్ పాముల సందు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

యలమంచిలి రూరల్ : మండలంలోని పోతురెడ్డిపాలెం సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు ఎదురుగా లారీ డ్రైవర్ మృతదేహం ఆదివారం బయటపడింది. మృతుడు తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన పాముల చందు(36) గా యలమంచిలి రూరల్ పోలీసులు గుర్తించారు. మృతుడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన మద్యం సీసాల లోడుతో విజయనగరం జిల్లా రణస్థలం వెళ్లి అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో యలమంచిలి మండలం పోతురెడ్డిపాలెం సమీపంలో బాగా మద్యం సేవించిన మత్తులో మూడు రోజుల క్రితం హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్దకు వచ్చాడు. బాగా మద్యం సేవించి మత్తులో ఉండడంతో తాను నడుపుతున్న లారీని అక్కడకు కొద్ది దూరంలో వదిలి వచ్చేశాడు. ఈ క్రమంలో మద్యం మత్తులోనే అనంతలోకాలకు వెళ్లిపోయాడు. లారీ యజమాని మృతుని మొబైల్ నంబరుకు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో వేరే డ్రైవరును పోతురెడ్డిపాలెంకు పంపించి వాహనాన్ని తీసుకెళ్లిపోయాడు. ఆదివారం దుర్వాసన రావడంతో అక్కడకు సమీపంలో నిర్మాణంలో ఉన్న దెక్కన్ సిమెంట్ పరిశ్రమ సెక్యూరిటీ గార్డు మృతదేహాన్ని గుర్తించి గ్రామ వీఆర్వోకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఘటనా స్థలానికి వెళ్లిన వీఆర్వో కుళ్లిన స్థితిలో ఉన్న చందు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర కేసు నమోదు చేసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, తల భాగంలో కుక్కలు మాంసం పీకినట్టు ఆనవాళ్లు ఉన్నాయన్నారు. కేసు దర్యాప్తు ప్రారంభించినట్టు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని యలమంచిలి మార్చురీలో భద్రపరిచారు. సోమవారం మృతుని కుటుంబీకులు వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

'సింహాచలం' అభివృద్ధిలో దాతల పాత్ర గొప్పది



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు



శంఖుచక్రనామాలు

- అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు

సింహాచలం: దేవస్థానాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతను తనిఖీ చేసేందుకు అహ్మదాబాద్‌లోని లేబొరేటరీ తరహాలో ఇక్కడ కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు అన్నారు. సింహగిరి వైకుంఠవాసుడి మెట్లపై జీఆర్టీ జ్యూయలర్స్ రూ.1.50 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన శంఖుచక్రనామాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ లేబొరేటరీ ఏర్పాటు వల్ల రాష్ట్రంలోని 9 ప్రధాన ఆలయాలతో పాటు 26 జిల్లాల్లోని చిన్న ఆలయాలకు ఇది ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. కామన్ గుడ్ ఫండ్ ద్వారా భవనాలు, పరికరాలను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సింహాచలం దేవస్థానం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం గొప్పదన్నారు. దేవస్థానంలో ప్రసాద్‌స్కీమ్ పనుల్లో జాప్యం జరుగుతోందని, మాస్టర్ ప్లాన్‌కు అనుసంధానంగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సింహగిరిపై శంఖునామచక్రాలను ఏర్పాటు చేసిన జీఆర్టీ జ్యూయలర్స్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జీఆర్టీ ప్రతినిధులు గోపికృష్ణ, సూర్యఅప్పారావులను ఘనంగా సత్కరించారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, దేవదాయ శాఖ ఏడీసీ కె.రామచంద్ర మోహన్, ఈవో వి.త్రినాథరావు, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అనకాపల్లి : శంకరం రైల్వే వంతెన సమీపంలో రైల్వే ట్రాక్‌పై సుమారుగా 45–50 సంవత్సరాల వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందినట్టు గుర్తించామని దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ కె.టి.ఆర్ లక్ష్మి ఆదివారం చెప్పారు. విజయవాడ నుంచి విశాఖ వెళ్లే రైల్వే ట్రాక్‌పై చామనఛాయ రంగు, ఎత్తు 5.7 అడుగులు ఉండి ఒంటిపై నలుపురంగు స్వెటర్, బ్లాక్ ఫ్యాంట్‌తో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విమ్స్ ఉద్యోగి బ్రెయిన్ డెడ్

- బీఆర్‌టీఎస్‌లో రోడ్డు ప్రమాదం
- స్పీడ్‌బ్రేకర్ కారణంగానే ఘటన?



ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో యువకుడు బ్రెయిన్‌డెడ్ అయి చనిపోయాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివీ.. నరవకు చెందిన పేడాడ మోహన్‌కుమార్(26) విమ్స్‌లో ఎంఎన్‌వోగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై బీఆర్‌టీఎస్‌లో ఇంటికి వెళ్తున్నాడు. దారంపాలెం వద్ద పరంపర హోటల్ ముందు ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను చీకటిలో గమనించలేకపోయాడు. ఆ స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మోహన్‌కుమార్ తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే అతన్ని విమ్స్‌కు తరలించారు.

అక్కడ చికిత్స పొందుతున్న మోహన్‌కుమార్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాధారణంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఉండవు. అత్యవసరమైన చోట్ల మాత్రమే ట్రాఫిక్ పోలీసుల సూచనలతో ఇంజినీరింగ్ అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేస్తారు. ఇటీవల ఇక్కడ స్పీడ్‌బ్రేకర్‌ను అనధికారికంగా వేసినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో.. చీకటిలో స్పీడ్ బ్రేకర్ సరిగా కనిపించడం లేదు. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వారం రోజుల్లో సుమారు 20 మంది ఇక్కడ ప్రమాదాలకు గురై గాయాలపాలయినట్లు స్థానికులు తెలిపారు.

క్షణకాలంలో కబళించిన మృత్యువు

- నాలుగో అంతస్తు పైనుంచి పడి యువతి మృతి



గాయత్రి మృతదేహం



గాయత్రి(ఫైల్)

పీఎంపాలెం: అప్పటి వరకు ఎంతో చలాకీగా ఉన్న ఆమెను క్షణకాలంలో మృత్యువు కబళించింది. ప్రమాదవశాత్తూ అపార్టుమెంట్ నాలుగో అంతస్తు నుంచి కిందకు పడి మృతి చెందింది. మధురవాడ శివశక్తినగర్‌లోని ఎస్‌వీఎస్ ఫైనేయర్ కాస్టల్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో విషాదం చోటుచేసుకుంది. పీఎంపాలెం ఎస్ఐ సునీత తెలిపిన వివరాలివీ.. శివశక్తినగర్‌లోని ఈ అపార్ట్‌మెంట్‌లో జరజాన భద్రాచలం, అతని భార్య ఉషారాణి, కుమారుడు వరాహ రామాచలం, కుమార్తె గాయత్రి(23) నివసిస్తున్నారు. భద్రాచలం యూఎస్‌లో సీమెన్‌గా పనిచేస్తున్నారు. నెల రోజుల కిందట విధులు నిమిత్తం ఆయన యూఎస్ వెళ్లారు. గాయత్రి నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. ఆదివారం ఉదయం తమ ఫ్లాట్ బాల్కని కింది భాగంను శుభ్రపరచే పనులు చేపట్టింది. బాల్కనికి కొంచెం దిగువన ఉన్న తులసి మొక్కను నీరు పోయడానికి గాయత్రి కిందకు వంగింది. ఈ క్రమంలో అదుపు తప్పి కిందకు పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయింది. కుమార్తె మరణించడంతో ఆమె తల్లి రోదించిన తీరు అందరినీ కలచివేసింది. అపార్ట్‌మెంట్ వాసులు విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పీఎం పాలెం ఎస్ఐ సునీత సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. గాయత్రి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఉషారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'కంటిపాప'లను కాపాడుకుందాం

ఏయూక్యాంపస్: చిన్న వయసులోనే కంటి సమస్యలను గుర్తించి.. చికిత్స అందించాల్సిన అవసరం ఉందని ఎల్.వి.ప్రసాద్ ఐ ఆస్పత్రి చిన్నారుల కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అభీష్ట శర్మ పిలుపునిచ్చారు. ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, జీఎంఆర్ వరలక్ష్మి సంస్థ ఆధ్వర్యంలో బాలల నేత్ర సంరక్షణ వారోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం ఉదయం అవగాహన నడక నిర్వహించారు. బీచ్ రోడ్డు కాళీమాత ఆలయం నుంచి విక్టరీ ఎట్ సీ వరకు ప్లకార్డులు పట్టుకుని, నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అభీష్ట శర్మ మాట్లాడుతూ పిల్లల్లో వచ్చే కంటి వ్యాధులపై సామాజిక అవగాహన కలిగించడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఏటా నవంబర్ 7 నుంచి 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా తమ శాఖల్లో చిన్నారులకు చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్, వక్తృత్వం, క్లే మోడలింగ్, బ్రెయిలీ చదవడం తదితర అంశాల్లో పోటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

బదిలీల్లో అవినీతి.. విచారణకు మోకాలడ్డు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈవోపీఆర్డీల బదిలీల్లో అక్రమాలు
- 'సాక్షి' వరస కథనాలతో విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- రెండు సార్లు నోటీసులిచ్చినా హాజరుకాని అనకాపల్లి డీపీవో
- తాజాగా విచారణాధికారి పరిధి కుదింపు



మహారాణిపేట: పంచాయతీరాజ్ శాఖలో అడ్డగోలు బదిలీల వ్యవహారంలో సరికొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. అక్రమ బదిలీల ఆరోపణలు ఉన్న జిల్లాలను విచారణకు మినహాయింపు ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగా అడ్డగోలు బదిలీల వ్యవహారం వెలుగులోకి రాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యనిర్వహణాధికారి అండ్ రూరల్ డెవలప్‌మెంట్(ఈవోపీఆర్డీ) బదిలీలపై విచారణ చేస్తున్న జెడ్పీ సీఈవో పరిధి కుదించడమే ఇందుకు నిదర్శనం.

ఉమ్మడి విశాఖ జిల్లాలో సెప్టెంబర్ 22న ఈవోపీఆర్డీల బదిలీ ప్రక్రియను చేపట్టారు. ఇందులో కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్ద పీట వేశారు. అలాగే కొంత మంది ఉన్నతాధికారులు భారీ ముడుపులు తీసుకుని కొందరికి స్థానచలనం కలిగించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కొంత మంది ఏకంగా ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేసినట్లు సమాచారం. దీనిపై ఉద్యోగులు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. ఏళ్ల తరబడి గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారు ఈ బదిలీలతో మైదాన ప్రాంతాల్లోకి రావచ్చని ఆశపడ్డారు. అయితే సిఫార్సులు, ముడుపులు కారణంగా వారు గిరిజన ప్రాంతాలకే పరిమితమయ్యారు. బదిలీ ప్రక్రియలో భారీగా డబ్బు చేతులు మారడం కారణంగానే తమకు అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

విచారణకు సహకరించని అధికారులు

కలెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో విచారణ ప్రారంభించారు. అయితే అనకాపల్లి, అల్లూరి జిల్లాల పంచాయతీ అధికారుల నుంచి ఎటువంటి సహకారం అందలేదని తెలిసింది. బదిలీ విషయంలో విచారణకు హాజరుకావాలని ఆ జిల్లాల పంచాయతీ అధికారులకు సీఈవో నోటీసులు జారీ చేశారు. అయితే వారు హాజరు కాకుండా డుమ్మా కొట్టారు. బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులు, తీసుకున్న నిర్ణయాల నివేదికలు కావాలని అడిగినా వారు స్పందించలేదు. దీంతో సీఈవో స్వయంగా ఆయా జిల్లాలకు వెళ్లి సమాచారం సేకరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇలా వివరాల కోసం ప్రయత్నిస్తున్న సమయంలో అక్కడి అధికారులు తమ జిల్లాలో తలదూర్చవద్దని.. విశాఖ జిల్లాలో మాత్రమే విచారణ చేసుకోవాలని చెప్పడంతో సీఈవో నిర్ఘాంతపోయినట్లు తెలిసింది.

మినహాయింపుపై అనుమానాలు

కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేస్తున్న సీఈవోపై కూటమి ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా అనకాపల్లి, అల్లూరి జిల్లాలను విచారణ నుంచి మినహాయించేలా ప్రభుత్వంతోనే చెప్పించడం గమనార్హం. దీంతో అక్రమ బదిలీల వ్యవహారంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాలను మినహాయిస్తూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. విచారణాధికారి పరిధిని కేవలం విశాఖకు మాత్రమే పరిమితం చేశారు.

'సాక్షి' కథనాలతో ప్రభుత్వంలో కదలిక

సెప్టెంబర్ 22వ తేదీనే బదిలీల ప్రక్రియను చేపట్టినప్పటికీ.. ఆ జాబితాను ఆ నెల 30వ తేదీ వరకు రహస్యంగా ఉంచడంపై అనేక ఆరోపణలు వినిపించాయి. కేవలం ఈవోపీఆర్డీలకు మెయిల్ పెట్టి చేతులు దులిపేసుకున్నారు. ఈ వ్యవహారం మీద పలువురు ఈవోపీఆర్డీలు విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్‌ను కలిసి ఫిర్యాదులు చేశారు. దీనిపై సాక్షి వరస కథనాలు ప్రచురించడంతో ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. ఈ బదిలీలపై విచారణ జరిపించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. విచారణాధికారిగా జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తిని కలెక్టర్ నియమించారు.

క్లుప్తంగా

నూకాంబిక సన్నిధిలో సీలేరు జెన్‌కో ఎండీ


జెన్‌కో సీఎండీ చక్రధర్‌బాబుకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ సిబ్బంది

అనకాపల్లి: గవరపాలెం శ్రీనూకాంబిక అమ్మవారిని ఆదివారం సీలేరు జెన్‌కో సీఎండీ కాండ్రేగుల వెంకట నరేష్ చక్రధర్‌బాబు కుటుంబ సభ్యులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భజనలు


కె.ఎస్.ఆర్.పేటలో ఇంటింట గోవిందుడు భజనలు చేస్తున్న భక్తులు

తుమ్మపాల: కె.ఎస్.ఆర్.పేటలో సీతారామ భజన బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింట గోవిందుడు పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. భజన బృందం సభ్యులు గొల్లవిల్లి పెంటారావు, సరోజినీ దంపతుల నివాసంలో ఓం నమో వెంకటేశాయ పూజ చేశారు. గణపతి పూజ చేసి విష్ణు అష్టోత్తరాలు, లక్ష్మీ అష్టోత్తరాలు, గోవింద నామాలతో కీర్తనలు, భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో భజన బృందం అధ్యక్షుడు చూచుకొండ రమణ, అయ్యప్ప భక్తులు, స్వాములు పాల్గొన్నారు.

నేడు ఉమా రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణం

అనకాపల్లి: స్థానిక శారదానది ఒడ్డున ఉమా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని స్వామివారికి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం ఉదయం 9.30 గంటలకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు సాలగ్రామ రఘు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయ కమిటీ సభ్యులను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. కల్యాణ అనంతరం ఆలయ వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

మహా మృత్యుంజయ హోమం నేడు

అనకాపల్లి: మండలంలో బట్టపూడి పంచాయతీ సోహం ఆశ్రమంలో సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహా మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్టు ఆశ్రమం నిర్వాహకుడు కాండ్రేగుల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రమంలో శివలింగానికి పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం ఆశ్రయానికి వచ్చే భక్తులకు అన్నసమారాధన చేస్తామన్నారు.

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో	: పర్తిసాయి
బ్లడీ బెగ్గర్	: షిర్డిసాయి
ధూం ధాం	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 3 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్.9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 203 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 156 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

చివరి దశలో కష్టాలు..!

- పూడికతీత పేరుతో సత్తమ్మపేటలో పిల్ల కాలువ మూసివేత
- పొట్ట దశలో వరి చేలుకు అందని నీరు
- రెండు రోజులుగా శ్రమదానంతో కాలువ తవ్వుతున్న రైతులు
- అధికారులు, పాలకుల అనాలోచిత నిర్ణయానికి రైతుల అవస్థలు


పులి కాలువ నుంచి నీటి కోసం పిల్ల కాలువలో మట్టిని తొలగిస్తున్న రైతులు

తుమ్మపాల: నిన్నటి వరకు ఒక లెక్క.. నేడు ఇంకో లెక్క అన్నట్లు ఉంది పట్టణంలో వరి రైతులు పరిస్థితి. మొన్నటి వరకు ముంపు సమస్యతో సతమతమైన రైతులు.. ఇప్పుడు వరి చేలులో నీరు లేక ఆందోళన చెందుతున్నారు. పట్టణం నుంచి శంకరం దరి బంగ్లా పరిసరాలలో వరి పంటకు నీరు లేని పరిస్థితి ఏర్పడింది. పొట్ట దశలో ఉన్న పంటను ఎలాగైన కాపాడుకోవాలని రైతులు కంకణం కంటుకుని.. పులికాలువ జంక్షన్ వద్ద దిగువకు వృథాగా పోతున్న నీటిని తమ పొలాల వైపు పారేలా చేయిచేయి కలిపి కాలువను తవ్వటం మొదలు పెట్టారు. ఈ కాలువ ద్వారా నీరు వస్తే సుమారు 100 ఎకరాల వరకు ఎండిపోతున్న వరి పంటను కాపాడుకోగలమని, అందుకే అందరం కలిసి కాలువను తవ్వుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

అధికారుల అనాలోచిత నిర్ణయం!

అధికారుల అనాలోచిత నిర్ణయం రైతులకు శాపంగా మారింది. రెండు నెలల క్రితం ఏర్పడిన ముంపు సమస్యను అధిగమించేందుకు సత్తమ్మపేట వద్ద జాతీయ రహదారి కింద కాలువల్లో పూడిక తీసి అక్కడ నుంచి బంగ్లా వైపు ఉన్న పిల్ల కాలువను అధికారులు కప్పించేశారు. దీంతో అప్పటి నుంచి బంగ్లా పరిసరాల్లో వరి పంటకు నీరు లేకుండా పోయింది. సరిగ్గా పొట్ట దశకి వచ్చేసరికి వరి పంట బీటలు వారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలకులు, అధికారులు చేసిన అనాలోచిత పనులతో తాము ఇబ్బందులు పడుతున్నామని, వారిని నమ్ముకుంటే చేతికందాల్సిన పంట చేదాటి పోతుందని భయంతోనే పార, గునపాం, కర్రలు చేత పట్టి కాలువ తవ్వేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. పులి కాలువ నుంచి పిల్ల కాలువ తవ్వేందుకు పొక్లెయిన్ వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో రెండు రోజులుగా రైతులే కాలువ తవ్వకాలు చేపడుతున్నారు. సోమవారం నాటికి నీరు పారేలా చేసేందుకు పాటు పడుతున్నారు. అధికారులు, పాలకుల అవగాహన లోపంతోనే ఇప్పుడు ఈ పరిస్థితులు తలెత్తాయన రైతులు మండిపడుతున్నారు.

పొట్టకొచ్చిన వరి ఎండిపోతోంది..



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మొదటి నుంచి కష్టాలే వస్తున్నాయి. వరి నారు మడుల నుంచి నేటి వరకు లెక్కకు మించి ఇబ్బందులు చూస్తున్నాం. ముంపునకు గురై వరి పంట తీవ్రంగా పాడైపోయింది. తెగుళ్లు, ఎరువుల కొరతను అధిగమించాం. ప్రస్తుతం వరి పొట్ట దశకు వచ్చింది. కానీ నీరు లేకుండా పోయింది. ఎప్పుడు పుష్కలంగా నీరు పారే మా ప్రాంతం నేడు నీరు లేకుండా చూస్తున్నాం. అవగాహన లేని పాలకుల నిర్లక్ష్యంతో అధికారుల చేసిన పనికి మా పొలాలు ఎండిపోతున్నాయి. సాగునీటి కోసం కాలువను తవ్వుతున్నాం

– కాండ్రేగుల సూరిబాబు, రైతు, అనకాపల్లి

వరి పొలంలో చుక్క నీరు లేదు..



మా గ్రామంలో వరి పండాలంటే చెరువు నీరే ఆధారం. ఏటి కాలువ సౌకర్యం ఉందని 1.5 ఎకరం కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏటి కాలువల్లో పూడిక కారణంగా నీరు పారలేదు. పులికాలువ నుంచి నీరు పారే కాలువను ఇటీవల అధికారులు మూసివేశారు. ప్రస్తుతం మా వరిపొలం ఎండిపోతోంది. దీంతో రైతులమంతా కలిసి పులికాలువ మీదుగా దిగువకు వృథాగా పోతున్న నీటిని తమ పొలాల వైపు మళ్లిస్తూ మూసివేసిన కాలువలో మట్టిని తొలగిస్తున్నాం.

– సేనాపతి మహాలక్ష్మినాయుడు, రైతు, కోడూరు గ్రామం

26న సీఐటీయూ నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.శంకరరావు

అనకాపల్లి: మోడీ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఈ నెల 26న దేశ వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు తెలిపారు. స్థానిక దొడ్డిరామునాయుడు భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడో సారి కారిృక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన రైతు చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకూ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఆర్ రాము, అడిగర్ల రాజు, జి.రేమండ్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గౌరమ్మకు ప్రత్యేక పూజలు


అమీన్‌సాహెబ్‌పేటలో నెలకొల్పిన గౌరమ్మ

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) విగ్రహాన్ని నెలకొల్పారు. కార్తీక మాసంలో గత మూడేళ్లుగా అమ్మవారిని నెలకొల్పి పూజిస్తున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా గౌరమ్మను ప్రతిష్టించి ఆదివారం పూజలు చేశారు. 11 రోజుల పాటు పూజలు అనంతరం శారదానదిలో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్రీడా కోటాతో ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం


రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో షటిల్ క్రీడాకారులతో రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: క్రీడలతో ఆరోగ్యంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని అనకాపల్లి రోటరీ క్లబ్ పూర్వపు అధ్యక్షుడు బి.ఎన్.గుప్తా తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానం, జార్జ్ క్లబ్, రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో షటిల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నట్లు చెప్పారు. విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం పోటీల్లో గెలిపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో రోటరీ పబ్లిక్ ఇమేజ్ జిల్లా అధ్యక్షుడు బుద్ధ రమణాజీ, పట్టణ రోటరీ క్లబ్ అధ్యక్షుడు సర్పిల్ రాజేష్, కార్యదర్శి అనిల్, సభ్యులు కడిమిశెట్టి సతీష్, పి.రాజేష్ నాయుడు, పీజే నాయుడు, రవి, ఎంఆర్ఎఫ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం కమిటీ అధ్యక్షుడిగా 'గుమ్మాల'

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి శ్రీసీతారామాలయ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గుమ్మాల నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక రామాలయం ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో డైరెక్టర్లుగా చింతా సురేష్, తంగేటి వెంకట్, ఆర్సి నారాయణరావు(నాని), మైచర్ల నరసింహమూర్తి ఎన్నికయ్యారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు పదవిలో ఉంటుందని అధ్యక్షుడు గుమ్మాల నాగేశ్వరరావు చెప్పారు. ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

'క్రీడా కోటాలో కోతలు తగవు'

అనకాపల్లి: క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం 62 క్రీడల్లో ప్రాముఖ్యత కల్పిస్తూ విద్యా, ఉద్యోగాల్లో అవకాశాలు ఇస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల్లో జీవో 74 నంబర్ విడుదల చేసి 29 క్రీడలకు పరిమితం చేయడం దారుణమని జాతీయ టెన్నీకాయిట్ సమైక్య టెక్నికల్ కమిటీ చైర్మన్, రాష్ట్ర ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.ఎస్.వి.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర పోటీలకు వెళ్లే క్రీడాకారులకు క్రీడా దుస్తులు, రవాణా చార్జీలు, పోటీలు నిర్వహించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని కోరారు. వివిధ క్రీడల్లో ఎంపికైన గ్రామీణ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి కోచ్‌ను నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

శూలాల మహోత్సవం నేడు

కశింకోట: మండలంలోని బంగారయ్యపేటలో చౌడేశ్వరి సమేత సాంబమూర్తి శూలాల మహోత్సవం సోమవారం నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేశారు. ఏటా కార్తీక మాసం రెండో సోమవారం ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలో ఉండి గంప శూలం, సుబ్రహ్మణ్య, నక్షత్ర శూలాలు, బుగ్గ శూలాలు ధరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. ఉత్సవం సందర్భంగా కేరళ నృత్య ప్రదర్శన, డ్యాన్స్ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తామని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు


కొప్పాక హైస్కూల్ పదో తరగతి పూర్వపు విద్యార్థులతో ఉపాధ్యాయులు


సమావేశమైన 1998-99 బ్యాచ్ నర్సింగబిల్లి హైస్కూల్ విద్యార్థులు

అనకాపల్లి: ఏం మిత్రమా.. బాగున్నావా.. ఏమి చేస్తున్నావు.. ఇన్నాళ్లకు గుర్తుకొంచామా.. అంటూ కొప్పాక హైస్కూల్ 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సందడి చేశారు. హైస్కూల్ ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన సుమారు 140 మంది పూర్వపు విద్యార్థులు అందరూ కుటుంబ సమేతంగా కలిసికోవడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండాపోయాయి. అప్పటి, ఇప్పటికీ స్కూల్ ఎంతగా బాగా అభివృద్ధి చెందిందో అంటూ చర్చించుకున్నారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఐదుగురు ఉపాధ్యాయులను సత్కరించారు.

కశింకోట: మండలంలోని నరసింగబిల్లికి హైస్కూలుకు చెందిన 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం సమావేశమయ్యారు. విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తీపి గుర్తులను జ్ఞప్తికి తెచ్చుకొని ఉల్లాసంగా గడిపారు. విద్యార్థుల తరపున పాఠశాలకు ప్రింటర్‌ను బహూకరించారు.

ఘనంగా భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం


భువనేశ్వరీదేవికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు యాతపాలెంలోని మణిపురంలో కొలువైన భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి అధివాస మహోత్సవంలో ఒక్కోసారి ఒక్కో పత్రితో నిర్వహిస్తారు. భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవంలో ఈసారి శంఖు పత్రితో పూజించారు. ముందుగా అమ్మవారికి మంగళస్నానాలు చేయించి, అనంతరం నూతన వస్త్రాభరణాలతో అలంకరించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

రెండో సోమవారం పూజలకు శివాలయాలు ముస్తాబు


కశింకోటలోని పురాతన శివాలయంలో వెలసిన త్రిపురాంతకస్వామి

కశింకోట: మండలంలోని శివాలయాలు కార్తీక మాసం రెండో సోమవారం పూజలకు ముస్తాబయ్యాయి. కశింకోటలోని పురాతన శివాలయం, కస్పావీధిలోని సాంబ శివుని ఆలయం, వెదురుపర్తిలోని స్వయం భూ రామలింగేశ్వరస్వామి ఆలయం, బయ్యవరం, పేరంటాలపాలెం, చింతలపాలెం, సోమవరం, నూతలగుంటపాలెం, కన్నూరుపాలెంలలోని శివాలయాలు, ఉగ్గినపాలెంలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయం, బంగారయ్యపేటలోని బసవేశ్వరస్వామి, సాంబమూర్తి ఆలయాలు, తాళ్లపాలెం సంతలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేయనున్నారు.

15న ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు


గాంధీనగరం ఎస్సీ వసతి గృహం వద్ద చర్చా వేదిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్.భాస్కర్

అనకాపల్లి: విజయనగరంలో ఈ నెల 15న ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు నిర్వహించనున్నట్టు ఉత్తరాంధ్ర విద్యార్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ తెలిపారు. గాంధీనగరం ఎస్సీ వసతి గృహం వద్ద ఆదివారం ఈ మేరకు ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ 'ఉత్తరాంధ్ర కరువు, వలసలు-విద్య, ఉపాధి రంగ సమస్యలు-కర్తవ్యాలు' అనే అంశంపై జరిగే ఈ సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. పాలక వర్గ పార్టీలు వారి రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం కోసం రాష్ట్రంలో ఉత్తరాంధ్రను కావాలని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు కేటాయించిన విశాఖ రైల్వే జోన్, సెంట్రల్ యూనివర్సిటీని, విద్యా సంస్థలకు నిధుల కేటాయింపు వంటి హామీలను అమలు చేయాలన్నారు. మూతపడిన జూట్, చక్కెర తదితర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తెరిపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే విరమించి సొంత గనులు కేటాయించాలన్నారు. ప్రైవేటీకరించిన ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వమే కొనసాగించాలని కోరారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని, వలసలను అరికట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా కమిటీ సభ్యులు జి.చందు, టి.గణేష్, ఈ.ఉదయ్ కిరణ్, మహేష్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి పాలనలో నిరుద్యోగులకు నిరాశ'


నెహ్రూచౌక్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువతకు నిరాశే ఎదురైందని సీపీఎం సెంట్రల్ కార్యదర్శి కె.ఈశ్వరరావు ధ్వజమెత్తారు. అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నెహ్రూచౌక్ వరకూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ వాయిదా పడిందని, గ్రూప్-1, గ్రూప్-2 పరిస్థితులు కూడా అగమ్యగోచరంగానే ఉన్నాయన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ చార్జీల పేరుతో రూ. 20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడాన్ని ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వ నాన్చుడు వైఖరి రాష్ట్రాభివృద్ధికి విఘాతం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గండి నాయనబాబు, అల్లు రాజు, ఎస్.నాగరమణ, పాంగి చలపతి, ఎం.రమణ, నాగిరెడ్డి సత్యనారాయణ, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరులకు ఘన నివాళి


అటవీ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గంపా లక్ష్మణ్

అనకాపల్లి: స్థానిక న్యూకాలనీ డివిజనల్ ఫారెస్ట్ అధికారి కార్యాలయంలో ఆదివారం ఉదయం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అమరవీరుల చిత్రపటానికి డివిజన్ ఫారెస్ట్ అధికారి గంపా లక్ష్మణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1939 నుంచి నేటి వరకు ఎంతో మంది అటవీ అధికారులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అమరులయ్యారని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, అటవీ శాఖలో అంకిత భావంతో విధులు నిర్వహించిన వ్యక్తులకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని నాలుగు రేంజ్‌లు, సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట

- పాల్గొన్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్


మరిడిమాంబ సన్నిధిలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని నారపాడు శివారు బలిజిపాలెంలో మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు, కరుణతో ఈ ప్రాంత ప్రజలు సిరిసంపదలతో జీవించాలని ఆకాంక్షించారు. ఉదయం నుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహ, పసిడి కలశ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. తొలుత విఘ్నేశ్వరపూజ జరిపి, శుద్ధ పుణ్యాహవచనం, రక్షా బంధనం, మండపారాధన, ప్రధాన కలశారాధన, అంకురార్పణ, పంచగవ్యప్రాశన, యాగశాల ప్రవేశం వంటి పూజలు నిర్వహించారు. హోమాలు, మృత్సంగ్రహణం, దేవతాహ్వానం, పసిడికలశ ఊరేగింపు అనంతరం జలాధివాసం, క్షీరాధివాసం, పుష్పాధివాసం, ధాన్యాధివాసం, నీరాజన మంత్ర పుష్పములు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, గండి రవి కుమార్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, కాపుశెట్టి శేషుబాబు, సబ్బవరపు నారాయణమూర్తి, బయలపూడి భగవాన్ జయరాం, రాపేటి రాము, కర్రి శ్రీనివాస్, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మామిడి కొండాజీ, ఎస్ దుర్గ, వనం అచ్చెంనాయుడు పాల్గొన్నారు.

1800 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి నరవలో నిల్వ ఉంచిన 1800 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పెందుర్తి పోలీసులు, జిల్లా సివిల్ సప్లయి అధికారులు ఆదివారం పట్టుకున్నారు. సబ్బవరం ప్రాంతానికి చెందిన కూన గోవిందరావు పీడీఎస్ బియ్యాన్ని సేకరించి బ్రాండెడ్ సంచుల్లో వేసి అధిక ధరలకు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో తను సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని నరవలోని ఓ గొడౌన్లో నిల్వ చేశాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు, పౌరసరఫరాల అధికారులు దాడి చేసి ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గోవిందరావును అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ వెల్లడించారు.